## క్లుప్తంగా

### గోదా దేవికి సారె సమర్పణ



**తాడేపల్లిరూరల్:** ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తర శతనామార్చన, సారె సమర్పణ కార్యక్రమాలు నిర్వహించామని, అనంతరం పాశుర విన్నపం, ఇంటింటి ధనుర్మాసం కార్యక్రమంలో భాగంగా భక్తుల ఇళ్లలో గోదాదేవి కల్యాణం నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**తాడేపల్లిరూరల్:** కృష్ణానది కనకదుర్గ వారధిపై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. విజయవాడ నుంచి ద్విచక్రవాహనంపై తాడేపల్లి వస్తున్న ముసలి జ్యోతిర్మయి(35) కనకదుర్గ వారధి మధ్యలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో తలకు తీవ్రంగా గాయమైంది. గాయపడిన యువకుడిని 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. జరిగిన ఈ ఘటనపై తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఘనంగా షైన్ ఆనంద శరణాలయం వార్షికోత్సవం



**తాడేపల్లిరూరల్:** మంగళగిరి రూరల్ పరిధిలోని చినకాకాని షైన్ ఆనంద శరణాలయం ఐదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుంకర రఘుపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనమై పిల్లలు శరణాలయాల్లో ఆశ్రయం పొందే పరిస్థితులు రాకూడదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. శరణాలయం నిర్వాహకురాలు సంధ్యారాణి మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నెల్లూరు జోన్ ఆర్టీసీ ఈడీ ఆదాం సాహెబ్, గుంటూరు జిల్లా ఆర్‌ఎం రవికాంత్, డెప్యూటీ సీటీఎం శ్రీనివాసరావు, గుంటూరు-1 డిపో డీఎం రామకృష్ణ, హైకోర్టు జూనియర్ న్యాయవాది సుంకర చరణ్, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ పాల్గొన్నారు.

### డొంక రోడ్డులో ముళ్ల కంప తొలగింపు

**తాడేపల్లిరూరల్:** రైతులు పండించిన పంటను బయటకు తీసుకురావాలంటే ముళ్ల కంప అడ్డుగా ఉందని, దానిని తొలగించాలంటూ కోరుతూ సోమవారం రైతు సంఘం అధ్యక్షులు జొన్నా శివశంకరరావు రైతు భరోసా కేంద్ర అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి రైతు భరోసా కేంద్రంలో ఉండవల్లి దళిత వాడ కరకట్ట నుండి నులకపేట మాత ఆశ్రమం వరకు గల డొంక రోడ్డుకు రెండువైపులా ముళ్ళ కంప పెరగడం వల్ల రైతులు తమ పంటపొలాల్లో పండిన వరి ధాన్యాన్ని బయటకు తీసుకురావడానికి సరైన మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అధికారులు డొంక రోడ్డులో వున్న ముళ్ల కంపను తొలగించి, రైతులు ధాన్యం తీసుకు వెళ్లడానికి మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు బక్కిరెడ్డి జె నాగిరెడ్డి, పోతురాజు రెడ్డి ఇస్సాకు, బాలయేసు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగం



**చేబ్రోలు:** మండలంలోని శలపాడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగం నిర్వహించారు. పీఎండీఎస్ వేసిన రైతు పొలంలో తుఫాన్ ప్రభావానికి కూడా పంట పడిపోకుండా నిలబడి ఉండటం వల్ల అధిక దిగుబడి వచ్చినట్లు గుర్తించారు. ఎకరాకు 41 బస్తాలు ధాన్యం దిగుబడి వచ్చినట్లు రైతు సాధికార సంస్థ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మాధవి తెలిపారు. రబీ పంట అయిన తర్వాత భూమిని ఖాళీగా ఉంచకుండా వ్యర్థాల్ని కలియదున్ని పీఎండీఎస్ ద్వారా ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని సూచించారు. దిగుబడి కూడా అధికంగా రావడంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వస్తుందని చెప్పారు.

# ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓలు



రిబ్బన్ కత్తిరించి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

**తాడేపల్లిరూరల్:** స్థానిక కేసీడబ్ల్యూ ఈఈఎస్ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 శాంతకుమారి, ఎంఈఓ-2 నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సదరన్ సైన్స్ ఫెయిర్ పేరిట తాడేపల్లి మండల స్థాయిలో ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ను న్విహిస్తున్నామని వివరించారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 25 మంది సైన్స్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు ఈ ఎగ్జిబిషన్‌కు విచ్చేశారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం దాసరి చలపతిరావు పాల్గొన్నారు.

**సృజనాత్మకతను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు**

**తాడికొండ:** విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకొని ముందుకెళ్తే విజయాలు సాధించవచ్చని ఎంఈఓ-2 డి.ప్రభాకర్ అన్నారు. తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎగ్జిబిషన్‌ను రిబ్బన్ కత్తిరించి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెరికల దేవరాజు, సైన్స్ ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, పీవీ నరేష్ బాబు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్‌వీ రమణయ్య, ఏవీవీ ప్రసాద్, పి.లక్ష్మి పాల్గొన్నారు.

**సెయింట్‌పాల్స్‌లో విజ్ఞాన ప్రదర్శన**



ప్రదర్శనలో పాల్గొన్న వేమవరం పాఠశాల విద్యార్థులు

**ఫిరంగిపురం:** మండలకేంద్రంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో మండల స్థాయి సైన్సు విజ్ఞాన ప్రదర్శన సోమవారం నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టులు ప్రదర్శించారు. వేమవరం గ్రామం ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు పర్యావరణకాలుష్యం నివారణ ప్రాజెక్టును ప్రదర్శించినట్లు పాఠశాల హెచ్ ఎం కమల్‌మోహన్ తెలిపారు.

## వీవీఐటీలో బబుల్ గమ్ చిత్ర బృందం సందడి




కళాశాలలో చిత్ర బృందం ఆటాపాటా

**పెదకాకాని:** సీనియర్ నటుడు రాజీవ్ కనకాల, ప్రముఖ యాంకర్ సుమ దంపతుల కుమారుడు రోషన్ కనకాల ప్రధాన పాత్రలో మానస చౌదరి హీరోయిన్‌గా రవికాంత్ పారెపు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రేమకథ చిత్రం బబుల్ గమ్ బృందం వీవీఐటీలో సందడి చేసింది. ఈ చిత్రం డిసెంబరు 29న విడుదల కానున్న నేపథ్యంలో కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి నంబూరు వీవీఐటీని సందర్శించింది. హీరో రోషన్ మాట్లాడుతూ ఈ చిత్రం యువతను విశేషంగా ఆకట్టుకుంటుందని తెలిపారు. యుక్తవయస్సులో ఏదైనా సాధించాలి అనిపించినపుడు అవరోధాలు ఎదురొస్తే ఎలా ఎదుర్కోవాలి ? అనే సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో హీరో రోషన్, హీరోయిన్ మానస, డైరెక్టర్ రవికాంత్, నటుడు జబర్దస్త్ రాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షికోత్సవం



**ఫిరంగిపురం:** మండలంలోని అమీనాబాద్‌లోని వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ 19 వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామికి పంచామృతాలతో వేద పండితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణమండపంలో స్వామివారికి వైదికశాస్త్ర బద్ధంగా గణపతిపూజ, మండపారాధన, పంచపాలక పూజ, పుణ్యాహవాచనం, హోమకార్యక్రమాలు నిర్వహించి శాంతికల్యాణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## ధాన్యం కాటాలో మోసం.. రైతుల ఆందోళన



వేబ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ

**పొన్నూరు:** వేబ్రిడ్జి తూకంలో మోసం చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మండలంలోని మన్నవ గ్రామ రైతులు సోమవారం ఆందోళన చేశారు. ప్రతి రోజు ధాన్యాన్ని తూకం వేసే క్రమంలో భారీస్థాయిలో మోసానికి పాల్పడుతున్నారంటూ రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని కట్టెంపూడిలో వేబ్రిడ్జి నిర్వాహకులు కొందరు రైసు మిల్లుల వారితో కుమ్మక్కై మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ధాన్యం లారీలు, ట్రాక్టర్లు బారుల తీరడంతో హడావుడిగా ధాన్యం కాటా వేసి రసీదులు ఇచ్చి పంపిస్తున్నారు. తర్వాత రైతులు ధాన్యాన్ని తీసుకువెళ్లి రైసుమిల్లులో విక్రయించాల్సి ఉంది. ఈ క్రమంలో మన్నవ గ్రామ రైతులకు చెందిన లారీ తూకంలో 11 క్వింటాళ్ల తేడా చూపించారు. మరో ట్రాక్టర్‌లో నాలుగున్నర క్వింటాళ్ల తేడా చూపించడంతో పసిగట్టిన రైతులు వేబ్రిడ్జి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని అధికారుల్ని కోరారు. సమాచారం తెలుసుకున్న తూనికల అధికారులు, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ధాన్యం తూకంలో వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు కూడా గుర్తించారు. రైతుల ఫిర్యాదు మేరకు శ్రీ లక్ష్మీ శ్రీనివాస వేబ్రిడ్జిలో తనిఖీలు చేయగా, తూకంలో తేడాను గుర్తించినట్లు తూనికల కొలతల జిల్లా అధికారి కొండారెడ్డి తెలిపారు. సంబంధిత రైతు 250 కిలోల వరకు నష్టపోయినట్లు గుర్తించామని చెప్పారు. వేబ్రిడ్జి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి



**తాడేపల్లిరూరల్:** మంగళగిరి పట్టణ పరిధిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మహేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లి వెంకట బాబూరావు, మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, దేవస్థానం ఈఓ ఎ.రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

## పెదకాకాని పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర ఆరోగ్య బృందం

**పెదకాకాని:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కేంద్ర ఆరోగ్య బృంద సభ్యులు సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల్ని పరిశీలించారు. ముందుగా ఆసుపత్రికి ప్రతి రోజూ వస్తున్న రోగుల సంఖ్య, మందుల పంపిణీ రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. మండలంలో రక్తపోటు, షుగరు వ్యాధితో బాధపడుతున్న వారి వివరాలు పరిశీలించి, వారికి ఎఫ్‌డీపీ ద్వారా అందుతున్న సేవల్ని పర్యవేక్షించారు. అనంతరం ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఐపీఏ టీమ్ డాక్టర్ సందేశ్, డాక్టర్ వరప్రసాద్, స్థానిక మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పులుసూరి ప్రవీణ దీప్తి, డాక్టర్ సింధూర, సూపర్‌వైజర్ పుసులూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాడికొండ సీఐగా ప్రభాకర్ రావు



**తాడికొండ:** తాడికొండ సీఐగా సీహెచ్ ప్రభాకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు విధుల నుంచి రిలీవ్ అయి నూతన సీఐకు బాధ్యతలు అప్పగించారు. మండల పరిధిలో శాంతి భద్రతల నిర్వహణలో తనవంతు అందరికీ అందుబాటులో ఉండి తగిన న్యాయం చేస్తానని ఆయన తెలిపారు.

# పైకస్ పార్కు పునరుజ్జీవానికి అడుగులు

- మునిసిపల్ నిర్లక్ష్యంతో తూట్లు పడిన లక్ష్యం
- నిధుల కొరతతో ఆగిపోయిన పార్క్ అభివృద్ధి
- పునరుజ్జీవానికి 'అడుగు' వేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని



పైకస్ పార్కులో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** ఆంధ్రా పారిస్ తెనాలిలో దక్షిణ భారతదేశంలోనే మరెక్కడా లేనటువంటి అరుదైన పైకస్ పార్కుకు మునిసిపాలిటీ నిధుల లేమితో గ్రహణం పట్టింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పైకస్ జాతుల మొక్కలతో ఏర్పాటు చేసిన పార్కు అభివృద్ధి ఆగిపోయింది. ఇతర హంగుల కల్పనకు బ్రేక్ పడింది. కనీస నిర్వహణ కూడా లేకుండా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కెనాల్ బండ్‌ను తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పైకస్ పార్కు పునరుజ్జీవంపై దృష్టిపెట్టారు. కెనాల్ బండ్‌పై మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ నాటికి ఈ పార్కును కూడా సందర్శకులకు అందుబాటులో తేవాలని సంకల్పించారు.

**మూడు ఎకరాల్లో..**

ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రమోహనరెడ్డి ఆలోచనల నుంచి పైకస్ పార్కు తెనాలిలో సాకారమైంది. పట్టణానికి ఉత్తరం వైపున విజయవాడ రహదారి పక్కన తూర్పు కాలువ అంచున గల మునిసిపల్ మంచినీటి పథకం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సువిశాలమైన 3 ఎకరాల స్థలం, నీటి లభ్యతతో పైకస్ పార్కుకు అంకురార్పణ చేశారు. కేంద్ర ప్రభుత్వ అమృత పథకం, మునిసిపాలిటీ సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఏపీ గ్రీన్ కార్పొరేషన్ తగిన మొక్కలను ఎంచుకుని మునిసిపాలిటీకి అందజేస్తుంది. వాటిని నాటించి, సంరక్షించటం మునిసిపాలిటీ బాధ్యతగా 2018-19లో పార్కు రూపకల్పనకు శ్రీకారం చుట్టారు.

**పైకస్ మొక్కలు అంటే..**

పైకస్ అంటే మర్రి జాతుల మొక్కలని అర్థం. రావి, మర్రి, జువ్వి, మేడి...తదితర రకాల మొక్కలతో కూడిన పార్కు ఇది. పైకస్ జాతి మొక్కలు దేశవ్యాప్తంగా విస్తారంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 17 రకాలు మాత్రమే ఉన్నాయని అంచనా. ఈ కొరతను నివారించి, కనీసం 100 రకాల పైకస్ జాతి మొక్కలను ఒకేచోట పెంచాలనేది ఈ పార్కు లక్ష్యం. తొలుత 20 రకాల మొక్కలను నాటారు. వీటిలో 40 ఏళ్ల వయసు కలిగిన రెండు మర్రి వృక్షాలను తెనాలి పరిసరాల నుంచి యంత్రాలతో ట్రాన్స్‌లోకేషన్ చేసి పార్కులో నాటించారు. ఎక్కువ వయసు కలిగిన బోన్సాయ్ (మరుగుజ్జు) వృక్షాలు, పైకస్‌లోనే ఇతర జాతుల మొక్కలు తెప్పించారు.

**ఆహ్లాద వాతావరణానికి 'ప్లాన్'**

సందర్శకుల కోసమని 'స్టాండ్ స్టోన్ గజబోస్'గా పిలిచే గోపురం తరహా కుటీర నిర్మాణాలను రాజస్థాన్ వర్కర్లతో ప్రారంభించారు. పార్కులో క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా జిమ్, ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను నిర్మించాలని ప్లానులో చేర్చారు. పార్కు మధ్యలో వేదిక ఉండి, చుట్టూ ప్రేక్షకులు కూర్చునే గ్యాలరీతో ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉంటుంది. చిన్న పిల్లల పుట్టిన రోజు, ఇతర రకాల ఫంక్షన్లకు అనువుగా దీనిని డిజైన్ చేశారు. పైకస్‌పై పరిశోధకుల దగ్గర్నుంచి, భావి పౌరులకు ఆసక్తిని కలిగించేలా ఆయా మొక్కలను లేబిలింగ్ చేస్తామని చెప్పారు. తర్వాతికాలంలో నిధుల కొరత, అధికారుల ఉదాసీనతతో పైకస్ పార్కు అంతటితోనే ఆగిపోయింది. తెనాలిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కెనాల్ బండ్‌కు అనుబంధంగా ఈ పార్కును సందర్శకులకు అనువుగా తీర్చిదిద్దే పనిలో ఎమ్మెల్యే శివకుమార్ కృషి చేస్తున్నారు. మునిసిపల్ అధికారులతో కలిసి సోమవారం పార్కును పరిశీలించారు. అవసరమైన ఆదేశాలను జారీచేశారు.

## మొబైల్ టెక్నాలజీపై అవగాహన అవసరం

**తాడేపల్లిరూరల్:** వెబ్ మరియు మొబైల్ అప్లికేషన్లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేఎల్ యూనివర్సిటీ, కేఎల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్స్ ఫౌండేషన్ సీఈఓ అలోక్ గోవిల్ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో వెబ్, మొబైల్ అప్లికేషన్‌ల కార్యశాల సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలోక్‌గోవిల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వెబ్ సర్వీస్, మొబైల్ అప్లికేషన్‌లకు డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. ఆ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు మంచి అవకాశాలు లభిస్తాయని వివరించారు. సైద్ధాంతిక పరిజ్ఞానం బేసిక్స్, ఆచరణాత్మక అనుభవం కలయికతో కోడింగ్ యొక్క చిక్కులను మరింత సులభంగా అర్థం చేసుకునే విధంగా ప్రయోగాత్మక ప్రాజెక్ట్‌లపై పని చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసీఐసీ సీఈఓ రమణ్‌కాంత్, కేఎల్ టీఎఫ్ మేనేజర్ మహేష్ గౌడ్, సింగీమాక్సిమ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేత



కార్డును అందజేస్తున్న దృశ్యం

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సోమవారం నిర్వహించారు. పెదకొండూరు గ్రామంలో నిర్వహించిన ఈ యాత్రకు సర్పంచి మేదర సౌజన్య, అగ్రికల్చర్ ఏఓ శిరీష ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఉజ్వల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్, సిలెండర్, రెగ్యులేటర్ అందజేశారు. యాత్రలో పాల్గొన్న వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డాక్టర్ హాసిని, క్షయవ్యాధి నివారణ అధికారి రవి పాల్గొన్నారు.

గొడవర్రులో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచి విశ్వనాథపల్లి ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఏపీఎం మహాలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి ఉజ్వల స్కీమ్ కింద అర్హులైన వారికి గ్యాస్ సిలెండర్, గ్యాస్‌స్టవ్, రెగ్యులేటర్, రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఉచితంగా నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

## సెయింట్‌ఆన్స్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు



క్రీస్తు ఉదయించిన సన్నివేశాన్ని చూపిస్తున్న విద్యార్థులు

**ఫిరంగిపురం:** మండల కేంద్రంలోని సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి పాల్గొని క్రీస్తు ఉదయించినందుకు గుర్తుగా కేకును కట్‌చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననంతో మానవాళి సమస్తం సంతోషించినట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీస్తు జననాన్ని తెలియజేస్తు విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ కె.నిర్మలామేరి పాల్గొన్నారు.

**ప్రియదర్శిని ఇంజినీరింగ్‌లో..**

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆదరణ కర్త మినిస్ట్రీస్ సిస్టర్ బి.రిబ్కా, క్రైస్ట్ కింగ్‌డమ్ మినిస్ట్రీస్ పాస్టర్ పి. మణికుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చందు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎ.రామారావు, ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్ర విష్ణు, సిస్టర్ పుష్ప పాల్గొన్నారు.

## 'స్పందన' ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి

**అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి**



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

**నెహ్రూనగర్:** ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర అదనపు కమిషనర్ కె. లక్ష్మీ శివజ్యోతి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ స్పందన నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని చెప్పారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 31 ఫిర్యాదులు అందాయని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి- 20, ఇంజినీరింగ్ విభాగానికి- 4, రెవెన్యూ విభాగానికి- 3, ప్రజారోగ్య విభాగానికి- 1, ఉపా సెల్ విభాగానికి -3 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎస్ఈ సుందరరామిరెడ్డి, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఆర్‌వోలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

**ఉద్యోగుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి**

ఉద్యోగుల సమస్యలపై అందే ఫిర్యాదుల్ని వేగంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు సూపరింటెండెంట్లను ఆదేశించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఉద్యోగుల సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా 3వ సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## చిట్టీల పేరుతో రూ.10 కోట్లకు శఠగోపం

- ఆరో బెటాలియన్ పోలీసులే బాధితులు
- మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**తాడేపల్లి రూరల్:** చిట్టీల పేరుతో రూ.పది కోట్ల మేరకు ఓ మహిళ మోసగించి, ఉడాయించిన ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. బాధితులు సోమవారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. కార్పొరేషన్ పరిధిలోని ఆరో బెటాలియన్‌లో ఓ వ్యక్తి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడితో సహజీవనం చేస్తున్న శ్రీదేవి, మాటల గారడీతో బెటాలియన్ సిబ్బందిని మభ్యపెట్టి చిట్టీల వ్యాపారాన్ని ప్రారంభించింది. పోలీసులు ఒక్కొక్కరిగా ఆమె వద్ద వందల సంఖ్యలో చిట్టీలు వేశారు. ప్రతి ఒక్కరూ నెలనెల ఆమెకు డబ్బులు చెల్లించగా ఆమె మాత్రం చిట్టీలు వేసిన పోలీస్ సిబ్బందికి ఆ నగదు చెల్లించకుండ ఏదో ఒక సాకు చెప్పి, మభ్య పెడుతూ వచ్చింది. బెటాలియన్ వద్ద నివాసం ఉండే ఆమె ఇంటికి తాళం వేసి తన సహజీవనం చేసే వ్యక్తితో సహా పరార్ అయింది. ఇద్దరి ఫోన్‌లు కూడా పనిచేయకపోవడంతో బంధువులు కూడా మాకు తెలియదని చెబుతుండడంతో ఆరో బెటాలియన్‌లో పని చేసే సిబ్బంది మోసపోయమంటూ మంగళగిరి పోలీసులను కలసి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సవరణ

ది. 24-11-2023 సాక్షి దినపత్రిక మంగళగిరి డివిజన్‌లో ప్రచురితమైన M/s. Shriram Finance Ltd., విజయవాడ, గవర్నర్‌పేట బ్రాంచ్ వారి గడ్డె అనసూర్యవతి W/o. వెంకటేశ్వరరావు వారి ప్రకటనలో డాక్యుమెంట్ నెం. 1969/1983 కు బదులుగా 1969/1983 & 1970/1983 & 1971/1983 & 1972/1983 & 1973/1983 & 1968/1983 దాఖలా మొత్తం వెరసి 1080 చ.గ॥ స్థలంగా మార్చి చదువుకొనగలరు. టి.వి.ఎస్. వాసుదేవరావు, అడ్వకేట్, విజయవాడ.

### ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

**పొన్నూరు:** ఆర్టీసీని ఆదరించే ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్నట్లు డిపో మేనేజర్ అజిత కుమారి తెలిపారు. డిపో పరిధిలోని నిజాంపట్నం, తెనాలి, వట్టి చెరుకూరు మార్గాల్లో ప్రయాణికులు బస్సు దిగే సమయంలో టికెట్‌పై తమ ఫోన్ నంబర్ రాసి లక్కీ డిప్ బాక్స్‌లో వేశారని ఆమె చెప్పారు. సోమవారం వాటిని డ్రా తీసినట్లు పేర్కొన్నారు.